# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-03-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. వచ్చే దశాబ్దంలో తెలంగాణాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2. తెలంగాణాలో 17 లోక్ సభ స్థానాలకు, సికింద్రాబాదు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలు సాఫీగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు.**

**3. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేపట్టనున్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌లో ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ రోజు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారు.**

**5. వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందించిందని ఆంధ్ర ప్రదేశ్ హోం శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు.**

==========================

వచ్చే దశాబ్దంలో తెలంగాణాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. నిన్న తెలంగాణాలోని జగిత్యాలలో జరిగిన విజయ సంకల్ప సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ జూన్ 2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు పూర్తవుతుందన్నారు. తెలంగాణ అంతటా అభివృద్ధి జరగాలని వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభిండంతోపాటు పలు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. జాతీయ రహదారులు సహా తెలంగాణలో మౌలిక సదుపాయాలను పెంచామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి లక్షా 30 వేల టన్నుల ధాన్యాన్ని కేంద్రం కొన్నామన్నారు.

--------------------------

తెలంగాణాలో 17 లోక్ సభ స్థానాలకు, సికింద్రాబాదు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలు సాఫీగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఒక లక్షా 80 వేల మంది సిబ్బందిని నియోగిస్తున్నామనీ, సమస్యాత్మక ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే అన్ని రకాలుగా

శిక్షణ ఇచ్చామనీ, ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పోలీసు సిబ్బంది సిద్ధంగా వున్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళినీ ఖచ్చితంగా పాటించాలని, ర్యాలీలు, సభల నిర్వహణ కోసం సువిధా యాప్ ద్వారా అనుమతి తీసుకోవాలని సూచించారు. సెలవు రోజుల్లోనే రోడ్డు షో లు నిర్వహించాలని, రద్దీ వున్న ప్రాంతాలలో వీటికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇంటి వద్ద నుండి ఓటింగ్ కోసం ఏప్రిల్ 22 లోపు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంటూ..

..వాయిస్.. 31 సెకన్లు

---------------------------

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎన్నికల సంఘం ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో... పోలింగ్ కేంద్రాన్ని మార్చుకునే హక్కు ఓటర్లకు లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పోలింగ్ కేంద్రాన్ని నిర్ణయించే అధికారం జిల్లా రిటర్నింగ్ అధికారికి మాత్రమే ఉంటుందనీ, కాబట్టి ఓటర్లు తమకు కేటాయించిన కేంద్రంలో మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుందనీపేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ , 25 లోక్ సభ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో భాగంగా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్రంలోని ప్రతి సచివాలయాన్ని సందర్శించి ప్రజల ఆశీర్వాదం తీసుకోవాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిన్న జరిగిన పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమిని ఎదుర్కొనే అంశంపై ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు ఎదుర్కోవడానికి తగిన వ్యవధి వున్నందున ఈ సమయాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "మేమంతా సిద్ధం" పేరుతో జగన్ మోహన రెడ్డి బస్సు యాత్ర చేపట్టాలని ఈ సమావేశం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

ఇలా ఉండగా.... ఈ నెల 27 వ తేదీ నుండి జగన్ మోహన రెడ్డి బస్సు యాత్ర ప్రారంభమయ్యే అవకాశం ఉందని ముఖ్య మంత్రి కార్యక్రమాల నిర్వహణా ఇన్ చార్జి ..., శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్ పాత్రికేయులకు తెలిపారు.

---------------------------

తెలంగాణాలో 17 లోక్ సభ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా 33 వేల 365 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మొత్తం 3 కోట్ల 30 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు ఒక లక్షా 94 వేల మంది వున్నారు. దివ్యాంగులు .... 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు ఇంటి నుండే ఓటు వేయడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. పోలింగ్ కోసం 54 వేల 353 వి వి ప్యాట్‌లు అందుబాటులో ఉంచింది. కాగా ... సికింద్రాబాదు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం 5 వందల బ్యాలెట్ యూనిట్లు, 5 వందల వి వి ప్యాట్ లను సిద్ధం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం రాత్రి పది గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్ల వాడకంపై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది.

---------------------------

వేతనాల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా జిల్లా కేంద్రాలలో ఈ రోజు నిర్వహించే చివరి గ్రీవెన్స్ డే వినతుల స్వీకరణలో పరిష్కరించుకోవాలని ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ సూచించారు. వారు తమ వినతులను అధికారులకు సమర్పించాలని పరిష్కారానికి ఇదే చివరి అవకాశమని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల వినతులను స్వీకరించి నివేదికలు అందించాలని జిల్లా అధికారులను నివాస్ ఆదేశించారు.

---------------------------

వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందించిందని ఆంధ్ర ప్రదేశ్ హోం శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామాల పర్యటన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పేదరిక నిర్మూలనకు దీర్ఘకాలిక ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల ఇంటివద్దకే వాటిని అందించామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేట వద్ద "ప్రజా గళం" పేరుతో తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి నిర్వహించిన బహిరంగ సభలో భద్రతా వైఫల్య కారకులపై చర్యలు తీసుకోవాలని కూటమి ప్రతినిధివర్గం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు విజ్ఞప్తి చేసింది. తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు వర్ల రామయ్య నిన్న అమరావతిలో పాత్రికేయులకు ఈ విషయం తెలియజేస్తూ ..... సభ నిర్వహణ గురించి రాష్ట్ర పోలీసులకు తగినంత ముందుగానే సమాచారం ఇచ్చామనీ, అయినప్పటికీ .... వారు సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం మోడర్న్ లాంగ్వేజ్ పేపర్ -1, జియోగ్రఫీ పేపర్ -1 పరీక్షలు జరుగుతున్నాయి తెలంగాణాలో ఈరోజు జరగనున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం మోడర్న్ లాంగ్వేజ్ పేపర్ -2, జియోగ్రఫీ పేపర్ -2 పరీక్ష కోసం సెట్-బి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణికి తెలియజేశారు.

---------------------------

తెలంగాణా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నిన్న కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, లోక్ సభ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై వారితో రేవంత్ రెడ్డి చర్చించినట్టు సమాచారం. ఈ రోజు జరిగే కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం సమావేశంలో కూడా ఆయన పాల్గొంటారు. మరొక వైపు .... కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఈ రోజు విడుదల అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

---------------------------

23 ప్రభుత్వ వెబ్ సైట్‌లలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహనరెడ్డి,రాష్ట్ర మంత్రుల ఫొటోలు తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు లేఖ రాశారు. 'ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన

నేపథ్యంలో  ప్రభుత్వ వెబ్సైట్లలో రాజకీయ పార్టీలకు చెందిన వారి ఫొటోలు ఉండరాదనీ,  వెంటనే వాటిని తొలగించేందుకు ఆదేశించాలనీ అచ్చెన్నాయుడు  లేఖలో పేర్కొన్నారు.

---------------------------

ప్రయాణికుల సౌకర్యార్థం డిబ్రూఘర్ – కన్యాకుమారి మధ్య నడిచే  వివేక్ ఎక్స్‌ప్రెస్‌ను వారానికి ఐదు రోజులపాటు నడపనున్నట్లు వాల్తేరు రైల్వే డివిజన్  సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఇప్పటివరకు వారానికి నాలుగు రోజులు నడుస్తుండగా.. ఈ నెల 22 నుంచి డిబ్రూఘర్–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్  మంగళ, గురు, శుక్ర, శని, ఆదివారాల్లో..   ఈ నెల 26 నుంచి సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

=======================